ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

గురువారం 13 జూన్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 26.0



కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. సీఎంగా చంద్రబాబు నాయుడు అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు ఏలూరు జిల్లా నుంచి నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాల వారీగా ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో బీసీలకు ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చారో మంత్రి వర్గంలోను అదే ప్రాధాన్యత కొనసాగించారు. ఈ క్రమంలో జిల్లా రాజకీయాలు పెద్ద ఎత్తున మారనున్నాయి. విభజిత జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మంత్రివర్గంలో చేరడంతో ఆయా జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమం యుద్ధ ప్రాతిపదికన పుంజుకోవాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఐదేళ్లుగా పెండింగ్‌లో వున్న పనులను పూర్తిచేయాలి. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని చల్లార్చాల్సిన బాధ్యత కొత్త కూటమి ప్రభుత్వానిదే. ఈ దిశగా వేగంగా అడుగులు వేయాలి.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్.. చిత్రంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, పవన్‌కల్యాణ్

మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కొలుసు పార్థసారథి

కొలువు తీరిన కూటమి సర్కార్

సీఎం చంద్రబాబు సహా మంత్రులుగా కొలుసు, నిమ్మల ప్రమాణ స్వీకారం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కూటమి ప్రభుత్వం కొలువుతీరిన సమయంలో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది సంబరాలు చేసుకున్నారు. అత్యధికులు మిఠాయిలు పంచుకున్నారు. ఒకరికి ఒకరు ఆలింగనాలు చేసుకుని అభినందనల్లో మునిగితేలారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలంతా ప్రత్యక్షంగా ప్రసారమవుతున్న ఎల్‌ఈడీల ముందు వేలాది మంది మహిళలు, యువకులు, రైతులు ప్రమాణ స్వీకారాన్ని ఆసక్తిగా గమనించారు. కొత్త మంత్రులు ఎవరనేది మంగళవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ప్రకటించారు. తమ జిల్లాలకు చెందిన వారు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వేళ కేరింతలు కొట్టారు. చంద్రబాబుకు అనుకూలంగా నినాదాలు చేశారు. శ్రీకాకుళం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రమాణ స్వీకార వేదిక వద్దకు చేరేందుకు తెల్లవారుజామునే ఏలూరు పరిసరాల్లో స్నానాదికాలు ముగించి పయనమయ్యారు. వీరందరికి తగు సౌకర్యాలు కల్పించటంలో అధికారులు జాగ్రత్తపడ్డారు. పాస్‌లు ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వడం, వేదిక ప్రాంగణం ఇరుకుగా ఉండటంతో చాలామంది నేతలు, కార్యకర్తలు ఒకింత అసహనానికి లోనయ్యారు. కారు పాస్‌లు, సభా పాస్‌లు ఉంటేనే ప్రమాణ స్వీకారానికి అనుమతించారు. మరెవరిని ముందుకు కదలనివ్వకుండా పోలీసులు అడ్డు తగలటం పట్ల కొంత అసంతృప్తి వ్యక్తమైంది.



మరోలా సీనియర్ల సేవలు

మంత్రి వర్గంలో కొందరికే అవకాశం దక్కడంతో మిగిలిన వారి సేవలను వినియోగించుకోవడానికి కూటమి నాయకత్వం సిద్ధమవుతోంది. టీడీపీ హయాంలో ప్రభుత్వ విప్‌గా చింతమనేని ప్రభాకర్ వ్యవహరించారు. ఈసారి అయన సేవలు వినియోగించుకునే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. చురుగ్గా ఉన్న ఎమ్మెల్యేలకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగిస్తారని భావిస్తున్నారు. ఈ తరహా కసరత్తు ఒకటి, రెండు రోజుల్లో ముగియనుంది. ఆ తరువాత కీలక ప్రకటనలు వెలువడతాయని ఆశిస్తున్నారు. ఈ నెల 17న శాసనసభ సమావేశమయ్యే అవకాశం ఉన్నందున దానికంటే ముందు, లేదా ఆ తదుపరి చంద్రబాబు తీసుకునే కీలక నిర్ణయాలు అత్యద్భుతంగా ఉంటాయని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి వర్గ కూర్పులో ఎవరికి ఎలాంటి అసంతృప్తి లేకపోయినా వీలైనంత మేర అందరు సంతృప్తిపడే విధంగానే వరుస నిర్ణయాలు ఉంటాయని, సీనియర్లు చెబుతున్నారు. పొత్తులో భాగంగా త్యాగాలకు ఓర్చిన గన్ని వీరాంజనేయులతోపాటు బొరగం శ్రీనివాసరావు, ఆకుమర్తి రామారావు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వంటి నేతలకు తగు ప్రాధాన్యత కల్పిస్తారని అంచనాకు వచ్చారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

ఇప్పుడున్న యంత్రాంగంలో పలువురు అధికారులు ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలు, ఎంపీలతో గడిచిన రెండు రోజులుగా సమావేశమవుతున్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే ఒకింత ప్రక్షాళనకు అవకాశమివ్వడంతో తమ పోస్టింగులు చెదరకుండా చూస్తున్నారు. మరికొందరు ప్రాధాన్యత కలిగిన పోస్టుల్లో నియామకానికి పావులు కదుపుతున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రమాణం చేసిన తర్వాత మాట్లాడదామని సర్ది చెబుతున్నారు. ఈ పరిస్థితి అన్ని నియోజకవర్గాల్లోనూ కనిపిస్తోంది. ప్రత్యేకించి జనసేన తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలను కొందరు అధికారులు కలిసి ఏదో రూపంలో తమకు ప్రాధాన్యత కలిగిన పోస్టింగ్‌లు ఇప్పించాలని సందేశాలు పంపుతున్నారు.

ఈ నెలలోనే పోలవరానికి సీఎం

నవ్యాంధ్ర సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు ఈనెలాఖరు నాటికి పోలవరం ప్రాజెక్టును సందర్శించగలరని సంకేతాలు వెలువడుతున్నాయి. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం పనులను తిరిగి పరుగులు పెట్టించి, పూర్తి చేస్తానని ఇంతకు ముందే ఎన్నికల ప్రచార సభల్లో స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తొలుత అత్యున్నత స్థాయిలో కీలక నిర్ణయాలకు అనువుగా ఫైళ్లపై సంతకాలు పెట్టి, కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పనులు 78శాతం పూర్తి అవ్వగా, మిగతా పనులు అన్ని ఎక్కడికక్కడే నిలిచే ఉన్నాయి. ఇప్పుడు కేంద్ర సహకారం ఉండటంతో కేంద్రంలో ఉన్నతాధికారులు ఒకరిద్దరు ఇప్పటికే ప్రాజెక్టును పరిశీలించి వెళ్లారు.

జవాబుదారీగా పనిచేస్తా

మంత్రిగా నిమ్మల ప్రమాణ స్వీకారం



పాలకొల్లు అర్బన్/ నరసాపురం, జూన్ 12 : 'ప్రజలు ఇచ్చిన భారీ మెజారిటీ మాలో బాధ్యత, జవాబు దారీతనం పెంచాయి. గత జగన్ ప్రభుత్వంలోని మంత్రుల మాదిరి మేం ప్రవర్తించం. ప్రజలకు అందుబాటులో ఉండి ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లే దిశగా పనిచేస్తాం. నిరుద్యోగులకు అండగా ఉంటాం' అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. టీడీపీ తరపున పాలకొల్లు ఎమ్మెల్యేగా మూడోసారి ఎన్నికైన ఆయనకు చంద్రబాబు కేబినెట్‌లో బెర్త్ దొరకడంతో బుధ వారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిత్యం జనంలో ఉంటూ ప్రజాపోరాటం చేయడంతో జగన్ హవాలోనూ భారీ ఆధిక్యతతో 2019లో విజయం సాధించారు. ఈసారి ఎన్నికల్లో అనూహ్యమైన ఆధిక్యత లభించింది. అధిష్ఠానానికి విధేయునిగా ఉండడంతో మంత్రి పదవి కేటాయించారు. జిల్లాలో బలమైన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు, తెలుగుదేశం పార్టీ కోసమే కష్టపడే మనస్తత్వం కలిసి వచ్చింది. మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన బుధవారం రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు, నరసాపురం మీదుగా పాలకొల్లు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎక్కడికక్కడ భారీ ఎత్తున స్వాగతం లభించింది.



కలపర్రు టోల్‌ప్లాజా వద్ద పార్టీ శ్రేణులను ముందుకు వెళ్లకుండా బారికేడ్లు అడ్డుపెట్టి నిలుపుదల చేసిన పోలీసులు

దండులా కదిలారు

- విజయవాడ వెళ్లే రహదారులన్నీ కిటకిట
- పాస్‌లు లేవంటూ కలపర్రు టోల్‌ప్లాజా వద్ద కూటమి శ్రేణుల అడ్డగింత
- పోలీసులతో వాగ్వాదం.. బారికేడ్లు తోసుకుని కార్యకర్తలు ముందుకు..

పెదపాడు/ఏలూరు టూ టౌన్/ఏలూరు క్రైం, జూన్ 12 : సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవ ఘట్టాన్ని తిలకించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు గన్నవరం వైపు కదలడంతో జిల్లాలోని రహదారులన్నీ కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో విజయవాడ వైపు వెళుతున్న వాహనాలను పోలీసులు పాస్‌లు లేవంటూ ఎక్కడికక్కడ అడ్డగించి దారి మళ్లించినా ఫలితం లేకపోయింది. పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు బారికేడ్లు అడ్డుగా పెట్టి సీఎం సభకు వెళ్లే వారిని నిలువరించారు. క్షణాల్లోనే పార్టీ శ్రేణుల వాహనాలతో జాతీయ రహదారి మొత్తం నిండిపోయింది. కొద్దిసేపు వేచి చూసిన నాయకులు, కార్యకర్తలు బారికేడ్లు తొలగించాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఘర్షణ వాతావరణం ఏర్పడకుండా పోలీసులు సంయమనం పాటించారు. కార్యకర్తలు బారికేడ్లను బలవంతంగా పక్కకు తోసేసి ముందుకు కదిలారు. నాయకులు, కార్యకర్తలు జై చంద్రబాబు అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది.



బారికేడ్లు తొలగిస్తూ పోలీసులతో కార్యకర్తల వాగ్వాదం

వాహనాలు ముందుకు కదలడంతో పోలీసులు చూస్తుండిపోయారు. పాస్‌లు లేని వారిని పోలీసులు వెనక్కి తిప్పి పంపటంతో టీడీపీ శ్రేణులు నిరాశచెందాయి. భీమడోలులో పోలీసులు కార్యకర్తలను అడ్డుకున్నారు. పాస్‌లు ఏలూరు ఎంపీ కార్యాలయంలో ఉన్నాయని, అక్కడి నుంచి తీసుకుని వెళతామని చెప్పినా వినకుండా పోలీసులు వినిపించుకోలేదు. నిడమర్రు, గణపవరం నుంచి వచ్చిన కార్లను ఆపేయడంతో పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

భారీ బందోబస్తు.. వాహనాల దారి మళ్లింపు

ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం బుధవారం చేస్తోన్న సందర్భంగా బుధవారం ఉదయం పదో నెంబర్ జాతీయ రహదారిపై పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటుచేశారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో జిల్లా పరిధిలోని జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్లు అడ్డరోడ్లు ఉన్న ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. పాస్‌లు ఉన్న వాహనాలను మాత్రమే విజయవాడ వైపుకు అనుమతించారు. మిగిలిన వాహనాలను వెనక్కు పంపించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చే భారీ వాహనాలను దేవరపల్లి, నల్లజర్ల, దూబచర్ల, భీమడోలు, గుండుగొలను, జంగారెడ్డిగూడెం రోడ్డు, చింతలపూడి రోడ్డు, శనివారపుపేట రోడ్డు (దుగ్గిరాల బ్రిడ్జి) కలపర్రు టోల్ గేటు వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భారీ వాహనాలను వేరే మార్గాలలో మళ్లించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం తర్వాత తిరుగు ప్రయాణాల్లోను వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.



సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఏలూరులో స్క్రీన్‌పై తిలకిస్తున్న మహిళలు

ప్రజల రుణం తీర్చుకుంటా

మంత్రిగా పార్థసారథి ప్రమాణ స్వీకారం

నూజివీడు, జూన్ 12 : 'నా విజయానికి కార్యకర్తల శ్రమే కారణం. నన్ను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా. 15 ఏళ్ళుగా నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించి రైతులకు సాగు, తాగు నీరందేలా చర్యలు తీసుకుంటా. నూజివీడు పట్టణ సమస్యలను పరిష్కరించి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా' అని మంత్రి పార్థసారథి అన్నారు. టీడీపీ తరపున నూజివీడు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు చంద్రబాబు కేబినెట్‌లో బెర్త్ దొరకడంతో బుధవారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్థసారథిని ఎప్పటికప్పుడు అదృష్టం వరిస్తూనే వుంది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ వున్నా ఉయ్యూరు నుంచి టిక్కెట్ దక్కించుకుని భారీ మెజారిటీతో గెలిచారు. తర్వాత పెనమలూరు నుంచి తొలిసారి గెలుపొందారు. 2024లో తిరిగి టిక్కెట్ వచ్చే సూచనలు లేకపోవడంతో ఆయన ఆ పార్టీకి రాజీనామా చేసి ఈ ఏడాది ఫిబ్రవరిలో టీడీపీలో చేరారు. ఆయన నూజివీడు నుంచి పోటీ చేసి 12 వేల మెజార్టీతో గెలుపొందారు. కూటమిలో బీసీ అభ్యర్థులు భారీ సంఖ్యలో గెలిచినప్పటికీ వైసీపీ నుంచి పార్థసారథికి బీసీ కోటాలో మంత్రి బెర్త్ దొరకడం అదృష్టమేనని టీడీపీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు నూజివీడు నుంచి మొదటిసారి డాక్టర్ ఎం.ఆర్ అప్పారావు మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1978, 1989లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పాలడుగు వెంకట్రావు మంత్రిగా పనిచేశారు. తరువాత తెలుగుదేశం తరపున నాలుగుసార్లు కోటగిరి హనుమంతురావు గెలిచినా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఎమ్మెల్యే పార్థసారథికి తొలిసారి మంత్రి పదవి దక్కింది. పార్థసారథి ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ కేబినెట్‌లో విద్యా శాఖ మంత్రిగా పనిచేశారు.



ముదినేపల్లిలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న కూటమి శ్రేణులు

బడి గంట మోగింది

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 12: కొత్త ప్రభుత్వం.. కొత్త విద్యా సంవత్సరంతో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. జగన్ ప్రభుత్వ ఐదేళ్ళ విధ్వంసకర విద్యా విధానాలతో విసిగిపోయిన టీచర్లు నూతనంగా కొలువు తీరిన కూటమి ప్రభుత్వంలో ఉపశమనాన్ని కోరుకుంటున్నారు. ఎనిమిది రకాల పాఠశాలల విధానంతో బాల బాలికలకు ప్రభుత్వ విద్యారంగాన్ని దూరం చేసిన వైసీపీ పాలన అస్తవ్యస్థ నిర్ణయాలకు కొత్త ప్రభుత్వం చెక్ పెడుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలో మొత్తం 1818 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలుండగా, ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు మొత్తం 1,46,361 మంది బాల బాలికలు చదువుతున్నారు. ప్రైవేటు రంగంలో 495 ఉండగా, వీటిలో 1,45,497 మంది విద్యార్థులు వున్నారు. సంఖ్యాపరంగా ప్రభుత్వ పాఠశాలలు జిల్లాలో ఎక్కువగానే వున్నా వాటిలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే ప్రైవేటు పాఠశాలల్లో స్వల్ప సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 7,734 మంది ఉపాధ్యాయులు వుండగా, ఎయిడెడ్‌లో 122 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 4,832 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలు తెరుచుకుంటున్న వేళ విద్యార్థులకు ఎనిమిది రకాల వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు ఏ ఒక్క స్కూలులోను ఉపాధ్యాయుల కొరత లేకుండా తాత్కాలిక సర్దుబాట్లతో సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. మరోవైపు కేవలం 228 పోస్టులతో అరకొర డీఎస్సీని గత ప్రభుత్వం ప్రకటించగా, ఇపుడు కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు సమాయత్తమవుతోంది. మెగా డీఎస్సీలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు ఎన్ని పోస్టులు కేటాయించిందీ గురువారమే స్పష్టత రానుంది. అమ్మఒడిస్థానే కొత్త ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరిట కుటుంబంలో పిల్లల సంఖ్యతో పరిమితం చేయకుండా ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున తల్లి బ్యాంకు ఖాతాకు జమ చేయడానికి ఉద్దేశించిన కొత్త పథకంలో ఆర్థిక సాయం కోసం ఎదురుచూసే తల్లులూ లేకపోలేదు.



ముస్తాబైన కైకలూరు మండలం రామవరం ఎంపీపీ స్కూల్

• ఎమ్మెల్యేలతో స్టూడెంట్ కిట్ల పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల బాల బాలికలకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన స్టూడెంట్ కిట్‌ల సరఫరాపై సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు స్పష్టతనిచ్చారు. వాస్తవానికి పాఠశాలలు ప్రారంభమైన రోజునే మొత్తం ఎనిమిది రకాల వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్‌లను విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉండగా, రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు కావడం, పూర్తిస్థాయిలో వస్తువులు పంపిణీ కాకపోవడం తదితర కారణాలతో ఒకటి, రెండు రోజులు ఆలస్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఆ ప్రకారం తాజాగా వెలువడిన మౌఖిక ఆదేశాల ప్రకారం జిల్లాకు అందిన స్టూడెంట్ కిట్‌ల పంపిణీని కొత్తగా ఎన్నికైన స్థానిక ఎమ్మెల్యేలతో చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారని ఎస్ఎస్ఏ స్థానిక అధికారిక వర్గాలు తెలిపాయి. దీనికి అనుగుణంగానే ఎమ్మెల్యేల సూచనల మేరకు స్టూడెంట్ కిట్‌లను బాల బాలికలకు అందజేయనున్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి బ్యాగులు, యూనిఫాం దుస్తులకు సరిపడా వస్త్రం మొత్తం 1,36,316 మంది విద్యార్థు లకు, బెల్టులు 94,017 మందికి, నోట్ పుస్తకాలు 8,39,948, పాఠ్య పుస్తకాలు 12.06 లక్షలు, బూట్లు 1,36,868 మందికి, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 16,075 మందికి అందజేయనున్నారు. వీటిలో బుధవారం వరకు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్టులు మాత్రం స్కూల్ పాయింట్‌లకు సరఫరా కాగా, మిగతా వస్తువులు జిల్లాకు కొద్ది రోజుల్లోనే వస్తాయని అధికారులు వివరించారు.


కొయ్యలగూడెంలో కేకుకట్ చేసి టీడీపీ నేతల సంబరాలు


చింతలపూడి మండలం ప్రగడవరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సందడి


ఏలూరులో మహిళల సందడి



ఏలూరు ఇండోర్ స్టేడియంలో సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని డిజిటల్ తెరపై తిలకిస్తున్న ప్రజలు


కలపర్రు టోల్‌గేట్ వద్ద నిలిచిన వందలాది వాహనాలు

ప్రమాణం పండగ

ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన టీడీపీ, కూటమి శ్రేణులు

జిల్లాలో పలుచోట్ల ఎల్‌ఈడీ తెరలపై వీక్షించిన కార్యకర్తలు, అభిమానులు


ప్రమాణస్వీకార ప్రాంగనంలో పెదవేగి మండల శ్రేణులు

పెదపాడు, జూన్ 12: ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకార ఘట్టాన్ని నేరుగా చూసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు పెద్దసంఖ్యలో గన్నవరం తరలివెళ్లారు. పెదపాడులో ఏలూరు పార్లమెంటరీ కమిటీ అధికార ప్రతినిధి గుత్తా అనిల్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. బుధవారం సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు బాణసంచా, మిఠాయిలు పంచి పెట్టి సందడి చేశారు. మండలంలో పలుచోట్ల ప్రత్యక్ష ప్రసారాల కోసం ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటుగా సుదూర ప్రాంతాల నుంచి బస్సుల్లో వచ్చిన వారిని జాతీయరహదారి పక్కనున్న రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిలుపుదల చేసి కళాశాల ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించాలని కోరారు. సాంకేతిక సమస్యతో ప్రత్యక ప్రసారానికి అంతరాయం ఏర్పడింది. సీఎంగా చంద్రబాబు ప్రమాణం స్వీకారం ప్రత్యక్ష ప్రసారం ప్రారంభం కాకపోవడంతో ఆడిటోరియంలో కొద్దిమంది వీక్షకులతో పాటు అధికారులు మొబైల్ ఫోన్లలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినా అటు స్థభాస్థలికి పంపకపోవడం, ఇటు ప్రత్యక్ష ప్రసారాన్ని సకాలంలో చూడలేక పోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

● పెదవేగి: ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటుతో పండుగ వాతావరణం నెలకొంది. కూటమి శ్రేణులు ఊరూరా సంబరాలు చేశారు. గ్రామాల నుంచి భారీఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివెళ్ళాయి. ట్రాఫిక్ జామ్‌తో శ్రేణులు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రమాణ స్వీకార ప్రాంగణానికి వెళ్ళి తమ అభిమాన నాయకుల ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. నాయకులతో ఫోటోలు దిగి, ఆనందం పొందారు.

● దెందులూరు: మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), మోతుకూరి నాని, ఏనుగు రామకృష్ణ, మండల కమిటీ ఆధ్వర్యంలో కార్లు, బస్సులు, ఆటోలు, మోటార్ సైకిల్‌పై పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. పోతునూరు, కొవ్వలి, పెరుగుగూడెం, గోపన్నపాలెం, శ్రీరామవరం, గాలాయగూడెంతో పాటు పలు గ్రామాల నుంచి వెళ్లారు.

● చింతలపూడి: చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకారం సందర్భంగా మండలంలో పలుచోట్ల కూటమి ఆధ్వర్యంలో బాణసంచాతో సందడి చేశారు. మండలానికి కేటాయించిన బస్సులో రాఘవాపురం నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు మాటూరి వెంకటరామయ్య ఆధ్వర్యంలో అభిమానులు తరలివెళ్లారు. బోడా నాగభూషణం, కొత్తపూడి శేషగిరి, అనిష్‌కుమార్, గాంధీ తదితరులు హనుమాన్ జంక్షన్ ఆలయంలో పూజలు చేశారు. ప్రగడవరంలో కూటమినేతలు, కార్యకర్తలు రామాలయంలో పూజలు చేసి ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణసంచా కాల్చారు. సీతానగరం, యర్రగొండపల్లి, రాఘవాపురం, చింతలపూడి గ్రామాల్లో జనసేన కార్యకర్తలు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్లో టీడీపీ నాయకుడు తాటి అప్పారావు ఆధ్వర్యంలో రోడ్డుపై టెంట్‌వేసి ఎల్‌ఈడి తెర ఏర్పాటుచేసి ప్రమాణస్వీకారాన్ని స్థానికులు వీక్షించారు. కంచనగూడెం, ముఖంపాడు, ఏరియాల నుంచి యువకులు ప్రమాణస్వీకారానికి తరలివెళ్ళారు. ఎంపీడీవో కార్యాలయం, చింతలపూడి మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. పాతచింతలపూడిలో కూటమినేతలు కేక్ కట్ చేశారు.

● కామవరపుకోట: మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కామవరపుకోట, కొత్తూరు, పాతూరు గ్రామాల నుంచి ఘంటా మురళీరామకృష్ణ, కిలారు సత్యనారాయణ, కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, బొబ్బిలి డాన్ దివాకర్, పందు జగదీష్, కోనేరు వెంకట్రామయ్య జయకృష్ణ, మోహన్, తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు, వేముల హనుమంతు, ఆడమిల్లి నుంచి జిజ్జూరి బాబ్జీ, గూడపాటి కేశవరావు, తడికలపూడి నుంచి తూతా లక్ష్మణరావు, బొంతు వెంకటేశ్వరరావు, బొప్పన అంజయ్య, మేరుగు సుందరరావు ఆధ్వర్యంలో రామన్నపాలెం, తూర్పుయడవల్లి, రావికంపాడు తదితర గ్రామాల నుంచి కూటమి శ్రేణులు తరలి వెళ్లారు. రామన్నపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం చేశారు. ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, లింగేశ్వరరావు, జాలపర్తి రాంబాబు, సత్యనారాయణ, వడ్లమూడి, కొట్టూరి రవి, రమేష్, ప్రసాద్, బాబూరావు, అంజిబాబు, దుర్గారావు, ఏసు, సాయిబాబు తదితరులు సేవలు అందించారు.

● పోలవరం: మండలం నుంచి కూటమి శ్రేణులు వందలాదిగా తరలి వెళ్లారు. గూటాల కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, రేపల్లెవాడ, ఎల్ఎన్‌డీపేట గ్రామాల నుంచి బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాహనాలలో వెళ్లారు. గుబ్బా రాంబాబు, ఇళ్ల సత్యనారాయణ, జక్కు సత్యనారాయణ, బొరగం వెంకటలక్ష్మి, గునపర్తి చిన్ని, గణేశ్, లక్ష్మణ్, వంశీ తదితరుల నాయకత్వంలో నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు.

● బుట్టాయగూడెం: సీఎం, మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో టీవిలో ప్రత్యక్ష ప్రచారం చేయగా మండల అధికారులు, సిబ్బంది కార్యక్రమానికి హాజరయ్యారు. తహసీల్దార్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: సీఎం, మంత్రుల ప్రమాణస్వీకారం సందర్భంగా మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ తెరపై వీక్షించారు. క్రాస్‌రోడ్డులో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు పంపిణీ చేశారు. మునిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, పులి శ్రీను, బాలాజీ, జనసేన నాయకులు మంత్రి గోపాలకృష్ణ, ఎం.వెంకన్నబాబు, నాగరాజు, బీజేపీ నాయకులు వాడపల్లి లక్ష్మాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకారణ వేడుకను జిల్లా ప్రజలు టీవీల్లో వీక్షించారు. నగరంలో రామకోటి, ఇండోర్ స్టేడియంలో ఎల్‌ఈడీ తెరలు అమర్చారు. వేలాది మంది ప్రమాణస్వీకార మహోత్సవాన్ని తిలకించారు. తిలకించిన వారిలో అధికంగా మహిళలు ఉండటమే విశేషం. ఈ రెండు ప్రాంతాల్లోనే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లలో టీవీల ద్వారా వేడుకను తిలకించారు.

● కొయ్యలగూడెం: సీఎం, మంత్రుల ప్రమాణస్వీకారంతో టీడీపీ, జనసేన నాయకులు సంబరాలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచారు. అనేక గ్రామాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో కేకుకట్ చేసి మిఠాయిలు పంచారు. పరింపూడిలో జనసేన నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

గంగిరెడ్ల మేఘలాదేవి, జ్యేష్ఠ రామకృష్ణ, మంచాల వెంకయ్య నాయుడు, కొత్తా రమా, బలుసు నాగేశ్వరరావు, బెల్లాని శ్రీను, జనసేన నాయకుల నక్కా బాబి, రామకృష్ణ, మేడిన కన్నయ్య, మధు, తదతరులు ఉన్నారు.

● లింగపాలెం: మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. గ్రామాల్లో నాయకులు కేక్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజారంజక పరిపాలన అందించడం నారాచంద్రబాబునాయుడికే సాధ్యమన్నారు. తెలుగుదేశం శ్రేణులు బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. మోరంపూడి మల్లికార్జున్‌రావు, గరిమెళ్ళ చలపతిరావు, బొంతు శ్రీను, బొంతు రాంబాబు, రాధాకృష్ణ, మునునూరి రాము, బుజ్జియ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ద్వారకా తిరుమల: మండలంలోని గ్రామాల నుంచి కూటమి శ్రేణులు గన్నవరం తరలివెళ్లారు. ద్వారకాతిరుమల నుంచి ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి, రేవూరి వెంకటేశ్వరరావు, తిమ్మాపురం నుంచి పోలిన శ్రీను, మారంపల్లి నుంచి లంకా సత్యనారాయణ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. దొరసానిపాడులో కారుమంచి మురళి, పసుమర్తి శేఖర్, మద్దిపాటి రత్నాజి, రాయపాటి సోమేశ్వరరావు తదితరులు బిస్కెట్, కూల్‌డ్రింక్స్ అందించారు.

● ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి మేకల రవి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. మల్కాపురం ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. లుకలాపు సత్యనారాయణ, కొట్టే సుబ్బారావు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి రాచన్నగూడెం, రౌతుగూడెం, జీలుగుమిల్లి, పి.రాజవరం, తదితర గ్రామాల నుంచి బస్సుల్లో తరలి వెళ్లారు. ఆయా గ్రామాల నాయకులు వారిని ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రమాణ స్వీకారం చూసేందుకు వెళ్లారు.

● ఉంగుటూరు: ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఉంగుటూరు నుంచి ఆర్టీసీ బస్సులో కూటమి కార్యకర్తలు వెళ్లారు. ఎంపీడీవో శర్మ, ఈవోపీఆర్డీ షేక్ షంషుద్దీన్, జనసేన నేత పంది రాంబాబు, టీడీపీ నేతలు ఇర్లపాటి మోషే, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కుక్కునూరులో కేకుకట్ చేస్తున్న కూటమి నాయకులు


కామవరపుకోట నుంచి వెళుతున్న నేతలు


దెందులూరు నుంచి తరలి వెళుతున్న నేతలు


జీలుగుమిల్లి నుంచి బయలుదేరుతున్న నేతలు


ఏలూరు మల్కాపురంలో కేట్ కేట్ చేస్తున్న నేతలు


ఉంగుటూరు నుంచి తరలివెళుతున్న నేతలు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

ఏలూరు క్రైం, జూన్ 12 : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో డిప్యూటీ లేబర్ కమిషనర్, డీఎల్ఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపివేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని బాలబాలికలకు ప్రభుత్వం ఉచిత విద్య, ఆహార ఏర్పాట్లు చేస్తున్నారని వాటిని వినియోగించుకుని ఉన్నత విద్యనభ్యసించాలని సూచించారు. అసంఘటిత కార్మికుల వివరాలు ఈ - శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధికోసం వచ్చిన పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఏడీఈ వెంకటావధాని, సర్వశిక్ష అభియాన్ ఏఎల్ఎస్ రాధాకృష్ణ, క్రాఫ్ట్ కోఆర్డినేటర్ ఆల్‌ఫ్రెడ్ గ్జేవియర్, పేనల్ అడ్వకేట్స్ రత్నరాజు, కూన కృష్ణారావు పలువురు పాల్గొన్నారు.

11 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు క్రైం, జూన్ 12: రెడ్‌క్రాస్ భవనంలో 11 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చేసినట్లు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి తెలిపారు. గతంతో పోలిస్తే రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, అత్యవసరమైనప్పుడు రక్తం అందించడానికి యువత స్పందించి ముందుకు వస్తున్నారన్నారు. బుధవారం 11 మంది తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి చేశామన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ.సీతారామ్, ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, రెడ్‌క్రాస్ గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, డాక్టర్ జి.స్పందన, గుర్రాల అఖిల్‌రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంస్కృతం ప్రారంభించాలి : అపస్ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న రాజకుమార్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 12: పాఠశాలల్లో సంస్కృతం సబ్జెక్టును ప్రారంభించడంతోపాటు, సీబీఎస్ఈ పాఠశాలల్లో బోధిస్తున్న సంస్కృతాన్ని కొనసాగించాలని అపస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఏలూరు ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేవిధంగా కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జీవో 117 ఉత్తర్వులను రద్దుచేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. సీపీఎస్ రద్దుచేయాలన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన హైస్కూల్ ప్లస్‌లలో పీజీటీ పోస్టులను మంజూరు చేయాలని, వేసవి సెలవుల్లో డ్యూటీలు నిర్వర్తించిన టీచర్లకు సంపాదిత సెలవులను మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర మహిళా కార్యదర్శి కళ్యాణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, శ్యాంసుందర్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణరెడ్డి, ఫణికుమార్, శ్రీనివాస్, రామ్మోహన్, ఉపేంద్రసింగ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు మెరుగు పరిచేందుకు తోపుడు బండ్లు

ఏలూరు టూటౌన్, జూన్ 12: నగరంలో పారిశుధ్య పనులు మెరుగు పరిచేందుకు నూతనంగా 49 తోపుడు బండ్లను కొనుగోలు చేసినట్లు నగర మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం తోపుడుబండ్ల ప్రారంభ కార్యక్రమంలో నూర్జహాన్ మాట్లాడుతూ 16 సర్కిల్స్‌లో 700మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఇంటింట చెత్త సేకరణ వాహనాలు సరిగ్గా పని చేయడం లేదని, రూ.10లక్షలతో తోపుడు బండ్లు కొనుగోలు చేశామని అన్నారు. కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా తడి, పొడి చెత్తకు వేరు వేరు డబ్బాల్లో వేసి పారిశుధ్య కార్మికులకు అందిచాలని కోరారు.

నగరాన్ని అభివృద్ధి పరిచేందుకు ఆదాయాన్ని పెంచే మార్గాలు ఆలోచించాలని నగర మేయర్ షేక్ నూర్జహన్ అన్నారు. టౌన్‌ప్లానింగ్ సచివాలయ సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మేయర్ షేక్ నూర్జహన్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ప్రధాన ఆదాయ విభాగం అన్నారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదన్నారు. కష్టపడి పని చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ సిబ్బంది కష్టపడి పని చేయాలని ఫీల్డ్‌లో తిరిగితే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు.

కేంద్రమంత్రికి ఎంపీ మహేష్ స్వాగతం


కేంద్రమంత్రి పాటిల్‌తో ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, జూన్ 12: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి వచ్చిన కేంద్ర మంత్రి ప్రఫుల్ పాటిల్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆయన్ని తోడ్కొని వెళ్ళారు. మహేష్‌యాదవ్ వెంట టీడీపీ శ్రేణులు ఉన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది : చింతమనేని

పెదవేగి, జూన్ 12: రాష్ట్రం పురోగమనం దిశగా పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. దుగ్గిరాలలో క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా విధ్వంసం, అరాచకంతో అల్లాడిన రాష్ట్ర ప్రజానీకానికి తొలకరి చిరుజల్లులా చంద్రన్న పాలన ఉంటుందన్నారు. మంత్రివర్గ ప్రమాణస్వీకారాన్ని తిలకించిన ప్రజానీకం ఆనందంతో పులకించిపోయారన్నారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లోనూ అభివృద్ధి దిశగా నడిపిస్తారన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ సంయుక్త పాలనతో రాష్ట్రం మునుపెన్నడూ లేని రీతిలో అభివృద్ధి చెందుతుందని, ప్రజలు ఇలాగే సహకారాన్ని అందించాలన్నారు.

చంద్రబాబు సీఎంగా రాష్ట్రం పురోభివృద్ధి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో పయనిస్తుందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. పవరుపేటలోని జనసేన కార్యాలయం వద్ద బుధవారంప్రమాణ స్వీకార మహోత్సవాన్ని టీవీలో తిలకించారు. జనసేత పవన్‌కల్యాణ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించడంతో పార్టీకి, ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు కూటమి నాయకులు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తారన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేసి పార్టీ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. బీవీ.రాఘవయ్యచౌదరి, సిరిపల్లి ప్రసాద్, నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, బొత్స మధు, అల్లు సాయిచరణ్, రమణ, రెడ్డి గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

భీమడోలులో భారీ ఎల్‌ఈడీ తెరల ఏర్పాటు

భీమడోలు, జూన్ 12 : ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకార ప్రత్యక్ష ప్రసారం చూసేందుకు గ్రామాల్లో భారీ ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. భీమడోలు, రావిచెట్టుసెంటర్, పూళ్ళ, గుండుగొలను తదితర గ్రామాల్లో భారీ తెరలపై తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ప్రమాణ స్వీకారంతో గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ప్రమాణ స్వీకర కార్యక్రమంలో పాల్గొనేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో ప్రయాణం అయ్యారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలను తనిఖీ చేసిన ఏవో


విత్తనాలను తనిఖీ చేస్తున్న ముత్యాలరావు

బుట్టాయగూడెం, జూన్ 12: మండలంలోని విత్తనాల దుకాణాలను ఏవో డి.ముత్యాలరావు బుధవారం తనిఖీ చేశారు. బుట్టాయగూడెం శ్రీ సాయి మణికంఠ పెస్టిసైడ్స్‌లోని విత్తన నిల్వలను తనిఖీ చేసిన అధికారి షాపులోని ధాన్యం విత్తన రకాల నుంచి ఎంటీయూ-1064, పీఎల్ఏ-1100, బీపీటీ-5204 నుంచి విత్తన మొలకశాతం, నాణ్యత ప్రమాణాలు తెలుసుకోడానికి నమూనాలను సేకరించారు.

అనంతరం ఏవో మాట్లాడుతూ షాపుల యజమానులు తప్పనిసరిగా మొలక కట్టి షాపు నందు ప్రదర్శించాలని సూచించారు. విత్తనాలు అమ్మేటపుడు రైతుకు తప్పకుండా బిల్లు ఇవ్వాలన్నారు. రైతులు కూడా విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత షాపు యజమాని నుంచి విత్తనాల బిల్లును తీసుకోవాలన్నారు. విత్తేముందు తప్పకుండా మొలక కట్టాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలన్నారు. మండలంలో రైతు భరోసా కేంద్రాలు, ప్రవేటు షాపుల్లో అన్నిరకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నాణ్యతలేని విత్తనాలు అమ్మివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీవారి ఉద్యానవనంలో పాము హల్‌చల్


గార్డెన్‌లో రక్తపింజరి

ద్వారకాతిరుమల, జూన్ 12: శ్రీవారి క్షేత్రంలో అన్నమయ్య విగ్రహం వద్ద ఉద్యానవనంలో పాము హల్‌చల్ చేసింది. పామును చూసిన భక్తులు భయాందోళనలకు గురయ్యారు. ఐదు అడుగుల పొడవుగా ఉన్న పామును రక్తపింజరిగా గుర్తించారు. ఇది చాలా విషపూరితం, ప్రమాదకరమైన పాము కావడంతో భక్తులు పరుగులు తీశారు. కాసేపటికి పాము చెట్లలోకి వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఓపెన్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 14మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 12 : ఓపెన్‌స్కూల్స్ దూరవిద్య సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఇంటర్ ఫిజిక్స్ పరీక్షకు జిల్లాలో ఏడుగురు విద్యార్థులు, కెమిస్ట్రీ 18మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు. మొత్తం 14మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదన్నారు.

ఏపీ పీజీసెట్‌కు 20మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 12: పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జరుగుతోన్న ఏపీ పీజీసెట్ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా బుధవారం రెండోరోజు 20 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 136 మంది, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూల్ పరీక్ష కేంద్రంలో 169మంది హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలలకు కిట్లు పంపిణీ

టి.నరసాపురం, జూన్ 12: మండలంలోని అన్ని పాఠశాలలకు కిట్లు పంపిణీ ప్రారంభించినట్లు ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కల్యాణి తెలిపారు. మానవ వనరుల కేంద్రంలో బుధవారం కిట్లు పంపిణీ ప్రారంభించారు. మొదటి విడతలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బెల్ట్‌లు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

పాఠశాలలో కేంద్ర బృందం పర్యటన రద్దు

ఉంగుటూరు, జూన్ 12: మండలంలో మధ్యాహ్న భోజన పథకంతో పాటు పాఠశాల విద్యార్థులకు రక్త హీనత తదితర అంశాల అమలుపై కేంద్ర ప్రభుత్వ బృందం పర్యటిస్తుందని రెండు రోజుల పాటు కైకరం హైస్కూలు ఉపాధ్యాయులు నానా హైరానా పడ్డారు. బుధవారం కేంద్ర బృందం పర్యటన రద్దయింది. బృందం రాకపోవడంతో ఉపాధ్యాయులు, తల్లి తండ్రుల కమిటీ, ఆరోగ్య సిబ్బంది అవస్థలు పడ్డారు. మండలంలో అంగన్వాడీ సెంటర్‌ను సందర్శిస్తారని సమాచారం రావడంతో అంగన్వాడీ టీచర్లు నానా హైరానా పడ్డారు. మంగళ, బుధవారాల్లో బృందం పర్యటిస్తుందని సమాచారం రావడంతో కైకరం హైస్కూలు హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు అందరినీ అప్రమత్తం చేసినా బృందం పర్యటించలేదు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు, జూన్ 12: చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్లవ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు శివారు రామచంద్రపురం వద్ద తనిఖీలు నిర్వహించి వాహనాన్ని సీజ్ చేసినట్లు పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా వాహన డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి

ఏలూరు కల్చరల్, జూన్ 12: ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో ఈ నెల 16న వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి నిర్వహిస్తున్నట్లు ఎస్‌పిఎస్ వాసు తెలిపారు. సినిమా పాటల పోటీలు, పాడనాతీయగా ఆడిషన్స్ నిర్వహిస్తామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బాలు గానామృతం ఆడియో ఆవిష్కరణ ఉంటాయన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో వైసీపీ సమావేశం!

బుట్టాయగూడెం, జూన్ 12: మున్సిపల్ కార్యాలయంలో వైసీపీ నాయకులు బుధవారం చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం పలు విమర్శలకు దారితీసింది. అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. వైసీపీ సమావేశంపై సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కమిషనర్ నరేంద్రకుమార్ తనకు సంబంధం లేదని ప్రకటనలో తెలిపారు. చింతలపూడి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు, చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పలువురు వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సమావేశం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి.

ఎమ్మెల్యే చంటి దంపతులకు సత్కారం


ఎమ్మెల్యే చంటిని సన్మానిస్తున్న నేతలు

ఏలూరు టూటౌన్, జూన్ 12: ఏలూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన బడేటి రాధాకృష్ణయ్య (చంటి)ని 25వ డివిజన్ టీడీపీ నేతలు బుధవారం సన్మానించారు. అత్యధిక మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే చంటి నగర ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తారన్నారు. శ్రీనివాస్, కడియాల విజయలక్ష్మి, గణేష్, మట్టా రంజిత్, మాణిక్యాలరావు, రాము, వేమూరి శ్రీధర్, కె.రమేష్, శర్మ, మురళీ, కే.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు


పాదయాత్రగా గుంటుపల్లి టీడీపీ శ్రేణులు

కామవరపుకోట, జూన్ 12: గుంటుపల్లికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే పాదయాత్రగా దైవ క్షేత్రాలు సందర్శిస్తామని మొక్కుకున్నారు. బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో గుంటుపల్లి నుంచి 108 మంది ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి మొక్కు చెల్లించుకున్నారు. జేతిన వెంకట్రావు, సర్పంచ్ గోరింక దాసు, కంఠమనేని పుష్పరాజ్యం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. పాదయాత్ర ర్యాలీని టీడీపీ నాయకులు లు కొల్లువారిగూడెంలో ప్రారంభించారు.

గంగానమ్మకు టీడీపీ కూటమి నేతల పూజలు

బుట్టాయగూడెం, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రులు బుధవారం ప్రమాణస్వీకారం చేయడంతో జంగారెడ్డిగూడెంలో కూటమి నేతలు గంగానమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఆలపాటి గంగాభవాని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తిలకించారు. నాయకులు షేక్ ముస్తఫా, మద్దిపాటి నాగేశ్వరావు, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిశోర్, కొప్పాక శ్రీనివాసరావు, ఉక్కుర్తి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** నగరంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సంఘ నాయకులు ప్రచారం నిర్వహించారు. రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ మాట్లాడుతూ నూతన ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్రంలోని 13జిల్లాల నుంచి రైతులంతా పెద్దఎత్తున మహాసభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి లలితకుమారి, జిల్లా కార్యదర్శి షేక్ భాష పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** నగరంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సత్రంపాడు లక్ష్మీగణపతి రజత కవచలాంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం చేశారు. అగ్రహారం, దక్షిణపువీధి, పవరుపేట, పత్తేబాద, ఎన్ఆర్‌పేట, రామచంద్రరావుపేట ఆలయాల వద్ద భక్తులు స్వామి వారికి పూజలు చేశారు.
- **కామవరపుకోట :** వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వల్ల భక్తులు స్కంద షష్ఠి పూజల నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామికి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడి చెల్లించుకున్నారు. స్వామివారికి గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ అర్చకులు సుదర్శనం సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు జరిపారు.
- **పోలవరం :** నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు విజయం సాధిస్తే జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామికి తలనీలాలు ఇస్తానని తెలగంశెట్టి రాము మొక్కు కున్నారు. 700 కిలోమీటర్లు ప్రయాణించి బుధవా రం మొక్కులు చెల్లించుకున్నారు. తన మిత్రుడు జి.మణికంఠతో కలసి కొండగట్టు ఆంజనేయస్వామికి వెళ్లారు.
- **టి.నరసాపురం :** పుట్రేల గ్రామానికి చెందిన గుర్రం శ్రీను వైసీపీ ఓటమి తట్టుకోలేక ఈనెల 8వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. త్వరలోనే పార్టీ తరపున ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. బందంచర్ల గ్రామానికి చెందిన నల్లూరి బాలకృష్ణ మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.



చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం






వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

పీఎం అవార్డుల ఎంపికకు కేంద్ర బృందం పర్యటన



కలెక్టర్‌ను కలసిన పీఎం అవార్డుల బృందం

ఏలూరు కలెక్టరేట్, జూన్ 12 : ప్రధానమంత్రి అవార్డులు-2023 ఎంపిక కోసం జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బృందం సభ్యులైన భూపేంద్ర సింగ్, శ్రీవత్సలకు పూలమొక్కలను అందించి కలెక్టర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పీఎం ఆవాస్‌యోజన, మిషన్ ఇంద్ర ధనుష్, పీఎం స్వానిధి, పీఎం విశ్వకర్మ యోజన, ముద్రా యోజన, హర్‌ఘర్‌జల్ యోజన, పీఎం మాతృవందన యోజన, పీఎం పోషణ యోజనకు సంబంధించిన వివరాలను వారికి కలెక్టర్ తెలిపారు.

అవార్డుల కోసం నామినేషన్ల ఆహ్వానం

ఏలూరు కలెక్టరేట్, జూన్ 12: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రిపబ్లిక్‌డే సందర్భంగా 2025 సంవత్సరానికి దేశపౌర, ప్రతిష్మాత్మక పద్మా అవార్డ్సు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డుల కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్టు సెట్‌వెల్ సీఈవో ఎమ్మీహెచ్ మెహర్రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డులు పొందగోరే వారు చేసిన సేవలు, కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక, సాంఘికసేవ, సైన్స్ ఇంజినీరింగ్, ప్రజాసంబంధాలు, సివిల్ సర్వీస్, ట్రేడ్, ఇండస్ట్రీస్ అవార్డులకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేర్కొన్న రంగాల్లో సేవలు చేసి ఉన్నవారే అర్హులన్నారు. ఉత్తమసేవ కనబరిచిన వారి దరఖాస్తు ఏపీ ప్రభుత్వం వెబ్‌సైట్‌లో 800 పదాలకు మించకుండా జూలై పదో తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. పద్మా అవార్డుల ఎంపికకు సంబంధించిన ఇతర వివరాలు భారతప్రభుత్వం శాంతిభద్రతల మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ప్రతిపాదనలు ప్రతిహార్డ్ కాపీ, సెట్‌వెల్ కార్యాలయానికి, సాఫ్ట్‌కాపీ, స్టెప్‌డాట్ వెస్ట్ గోదావరి యట్ ది రైట్ ఆఫ్ జీ మెయిల్ డాట్ కామ్‌కు మెయిల్‌కు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో గరగపర్రు వీఆర్వో మృతి



స్వామినాయుడు (ఫైల్)

పాలకోడేరు, జూన్ 12: గరగపర్రు వీఆర్వోగా పనిచేస్తున్న సంతత స్వామినాయుడు(49) బుధవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. గరగపర్రు గ్రామంలో వీఆర్వోగా పని చేస్తున్న స్వామినాయుడు రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రికి వెళ్లారు. డాక్టర్లు యాంజియయ్ గ్రామ్ చేయించుకోవాలని సూచించడంతో బుధవారం ఆయన స్వగ్రామం తాడేరు నుంచి భార్యను బైక్‌పై ఎక్కించుకుని నేరుగా ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలో యాంజియయ్‌గ్రామ్ చేస్తుండగా మరోసారి గుండెపోటు వచ్చిందని తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని మండల రెవెన్యూ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

మొదలైన ఇసుక కష్టాలు

- నిలిచిన ఎగుమతులు
- జూన్ మూడో తేదీతో అమ్మకాలు బంద్
- వరదలు వస్తే తప్పని ఇబ్బందులు
- కిరాయిలు లేక లారీ యజమానుల ఆందోళన

కూటమి అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక పాలసీని మళ్లీ తీసుకువస్తామని టీడీపీ నేత చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేర్చాలని వినియోగదారులు, టిప్పర్ లారీ యజమానులు కోరుతున్నారు.

పాలకొల్లు, జూన్ 12 : ఉమ్మడి జిల్లాలో ఇసుక కష్టాలు మొదలయ్యాయి. జూన్ మూడో తేదీ తెల్లవారు జాము వరకు ఇసుక అక్రమ రవాణా జరగ్గా, ఎన్నికల ఫలితాలు వెలువడం మొదలైన వెనువెంటనే ఇసుక ఎగుమతులు నిలిపివేశారు. ఐదేళ్లపాటు ఇసుక అమ్మకాలను ఇష్టారాజ్యంగా చేసి, వేల కోట్ల రూపాయలు తాడేపల్లికి చేర్చిన ఇసకాసురులు ఈనెల నాలుగో తేదీ నాటికి దుకాణాలు సర్దేశారు. అనూహ్యరీతిలో కూటమికి ప్రజలు పట్టం కట్టడంతో జె-బ్రాండ్ మూకలు నిశ్శబ్దంగా ఇసుక ర్యాంపులు, స్టాక్ పాయింట్ల నుంచి దుకాణం సర్దేశారు.

నిలిచిన ఎగుమతులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 20పైబడి ఇసుక ర్యాంపులు ఉన్నాయి. వీటిలో కొన్నింటిలో నేరుగా గోదావరిలోకి లారీలు వెళ్లి ఇసుక ఎగుమతి చేసుకునే విధానం ఉండగా పలు ర్యాంపులలో పడవలలో ఒడ్డుకు తెచ్చిన ఇసుకను లారీల్లో ఎగుమతి చేస్తారు. జూన్ మూడో తేదీ తెల్లవారుజాము వరకూ జరిగిన ఎగుమతులు, ఎన్నికల ఫలితాలతో ఒక్కసారిగా నిలిచాయి.

నూతన పాలసీకై ఎదురుచూపు



పడ్డిలంక ర్యాంపు (ఫైల్)

నూతన పాలసీ రూపొందించాలి..

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో ఇసుక ఉచితంగానే సరఫరా చేశారు. కేవలం రూ. 5, 6 వేలకు ట్రాన్స్‌పోర్టు ఖర్చుతో ఐదు యూనిట్ల ఇసుక వినియోగదారుడికి లభించేది. జగన్‌రెడ్డి పాలనలో ఐదు యూనిట్ల ఇసుక రూ. 20 వేలుకు చేరింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇసుక తవ్వకాలపై పాలసీ రూపొందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

కిరాయిలు లేక ఆందోళన..

వారం రోజులుగా ఇసుక ఎగుమతులు పూర్తిస్థాయిలో నిలిచిపోవడంతో టిప్పర్ లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. కిరాయిలు లేకుంటే లారీల యజమానులు ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడతామని పలువురు లారీ యజమానలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

వరదలు వస్తే ఇబ్బందులే..

సాధారణంగా ప్రతీ ఏటా గోదావరి నదికి జూన్ నెలాఖారు లేదా జూలై మొదటి వారంలోనే వరదలు వస్తుంటాయి. భారీ వర్షాలు కురిస్తే గోదావరి వరద నీటితో పొంగుతుంది. వరద వస్తే పోలవరం నుంచి నరసాపురం వరకు గోదావరిలో ఇసుక తవ్వకాలు నిలిచిపోతాయి. అదే జరిగితే నవంబరు వరకు ఇసుక కష్టాల సమస్య పరిష్కారం లభించదు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రోజుల వ్యవధిలో ఇసుక పాలసీని ప్రకటిస్తే ఆ వెంటనే సంబంధిత శాఖ అనుమతులు లభించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఇసుక తవ్వకాలు మొదలవుతాయి.

ఇసుక కొల్ల గొట్టేశారు..

జగన్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ర్యాంపులలో పరిమితికి మించి ఇసుక తవ్వేశారు. రెండు లేదా మూడు అడుగుల మేర మేట వేసిన ఇసుకను తవ్వాల్సి ఉండగా పలు ర్యాంపులలో 5, 6 అడుగుల లోతున ఇసుకను తవ్వేశారు. ఇసుక నాణ్యత తగ్గితే బొండు ఇసుక పేరుతో పల్లపు ప్రాంతాలు, లే ఔట్ల పూడికలకు తరలించేవారు. మొత్తంగా కొన్ని ర్యాంపులలో ఇసుక తవ్వకాలకు స్టాక్ పాయింట్లలో అనుమతి ఇవ్వాలి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తీపర్రు, చిడిపి, తదితర ప్రాంతాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో కాతేరు, లాలా చెరువు, రావులపాలెం, గన్నవరం వంటి ప్రాంతాల్లో ఇసుక నిల్వలు ఉన్నాయి. నూతన పాలసీ వచ్చేలోపు స్టాక్ పాయింట్లలోని ఇసుక ఎగుమతులకు అనుమతులు ఇవ్వాలని లారీ యజమానులు, వినియోగదారులు కోరుతున్నారు.

నూతన పాలసీకై ఎదురు చూస్తున్నాం



అసోసియేషన్ ద్వారా కూటమికి మద్దతును నేరుగా ప్రకటించాము. ఇచ్చిన మాట ప్రకారం కూటమి విజయానికి కృషి చేశాం. ఇప్పుడు కొలువు దీరే ప్రభుత్వం వెంటనే ఉచిత ఇసుక పాలసీ రూపొందించి, అదేవిధంగా లారీ యజమానులకు నష్టం రాని విధంగా కిరాయిలు రూపొందించి నష్టాల్లో కూరుకుపోయిన టిప్పర్ లారీ యజమానులను ఆదుకోవాలి.

- రావూరి రాజా. పాలకొల్లు
ఉభయ గోదావరి జిల్లా టిప్పర్ లారీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు

స్నేహితులతో కలసి బీచ్‌కు వెళ్లి..

» రామాపురం సముద్రతీరంలో తాడేపల్లిగూడెం విద్యార్థి మృతి



కె.గౌరీష్ (ఫైల్)

రామాపురం(చీరాల టౌన్), జూన్ 12 : చీరాలలోని రామాపురం సముద్రతీరంలో తాడేపల్లిగూడెం పరిధిలోని కె.పెంటపాడుకు చెందిన విద్యార్థి మృతి చెందిన ఘటన జరిగింది. వివరాలివి.. కె.పెంటపాడుకు చెందిన కనగళ్ల గౌరీష్(21) చెన్నై ఎంజీఆర్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి కేవీ సత్యనారాయణ సేల్స్‌మెన్‌గా పనిచేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున విజయవాడలో ఉంటున్న స్నేహితులు సృజన్, అభినవ్, హరీష్, అయాన్‌తో కలిసి రామాపురం సముద్రతీరానికి బైక్‌లపై వచ్చారు. ఉదయం ఆరు గంటలకే సముద్రంలోకి దిగా రు. కొద్దిసేపటికే అలల తాకిడికి గౌరీష్, సృజన్, అభినవ్, అయాన్ కొట్టుకుపోబోయారు. అదృష్టవశాత్తు ముగ్గురు ఒడ్డుకు చేరగా గౌరీష్ లోపలకు కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఈ మేరకు మిత్రులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభిస్తుండగానే అదే ప్రాంతంలో గౌరీష్ విగతజీవిగా ఒడ్డుకు చేరాడు. సమాచారం అందుకున్న వేటపాలెం పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు విగతజీవిగా ఉండటాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్ద బోరున విలపించారు.

రెండు రోజుల్లో వస్తానని తల్లికి ఫోన్..

గౌరీష్ ఈనెల 2వ తేదీన విజయవాడలోని మిత్రుడు సృజన్ వద్దకు వచ్చి అక్కడే ఉంటున్నాడు. తల్లిదండ్రులకు చెన్నైలోనే ఉన్నట్టు ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. మంగళవారం రాత్రి తల్లికి ఫోన్ చేసి చాలాసేపు మాట్లాడాడు. రెండు రోజుల్లో వస్తానని ఫోన్ ముగించాడు. ఈలోపు తెల్లారేసరికి కుమారుడి మరణవార్త విన్న తల్లి శోకసంద్రంలో మునిగిపోయింది.

రైలు ఎక్కుతూ జారిపడిన వ్యక్తిని..



ఇరుక్కుపోయిన వ్యక్తిని బయటకు తీస్తున్న దృశ్యం

భీమవరం క్రైం, జూన్ 12 : రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి రైలుకు.. పట్టాలకు మధ్య ఇరుక్కుపోయిన వ్యక్తిని చాకచక్యంగా కాపాడారు. వివరాలివి.. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుంచి గుంటూరు ప్యాసింజర్ రైలు భీమవరం రైల్వేస్టేషన్‌కు వచ్చి ఆగింది. ఆ సమయంలో ప్లాట్‌ఫామ్ పనులు చేసుకునే పల్లాబత్తుల చినబాబు అనే వ్యక్తి రైలు ఎక్కుతూ జారిపడిపోయాడు. సత్వరమే అక్కడున్న రైల్వే సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే రైలును సిగ్నల్ ఇవ్వకుండా ఆపి ప్లాట్‌ఫామ్‌ను గునపాలతో బద్దలు కొట్టి అతడిని కాపాడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సుమారు గంట సేపు రైలును నిలుపుదల చేశారు.

కొబ్బరి చెట్టు దగ్ధం

ఆకివీడు, జూన్ 12: ఓ గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్టు కాల్చిపారేయడంతో కొబ్బరి చెట్టు దగ్ధమైన ఘటన అజ్జమూరులో జరిగింది. అజ్జమూరు గరువుకు చెందిన బచ్చు కృష్ణ నివాసంలో వెనుక వైపు ఉన్న కాగితాలలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్టు కాల్చి పారివేయడంతో అంటుకున్నాయి. పక్కనే ఉన్న కొబ్బరి చెట్టు పూర్తి కాలిపోయింది. అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వగా వచ్చి మంటలను అదుపుచేశారు. రూ.10వేలు నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

15న జాబ్‌మేళా

ఏలూరు కలెక్టరేట్, జూన్ 12 : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ప్రభుత్వ యువజన సర్వీస్‌లశాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15న కలెక్టరేట్ కాంపౌండ్‌లోని సెట్‌వెల్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు ఓ ప్రకట నలో పేర్కొన్నారు. స్పందన, స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఉద్యోగానికి సంబం ధించి ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ పురుషులకు రూ.12,500 నుంచి ప్రారంభమై బదిలీ అలవెన్స్, ఇన్‌సెంటివ్స్, ఉచిత భోజన, వసతి సౌకర్యం, ఆరోగ్యబీమా రూ.4 లక్షలు, ప్రమాదబీమా రూ.20 లక్షలు ఇవ్వబడుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు.. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో అనుభవం ఉండాలని, 21 నుంచి 27 ఏళ్ల లోపు వయసు, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. హనుమాన్‌జంక్షన్ సమీపంలోని మల్లవల్లి వద్ద నున్న మోహన్ స్పిన్‌టెక్స్‌లో ఉద్యోగం కోసం గార్డులు పురుషులకు రూ.11 వేల నుంచి రూ.13వేలు జీతం. 8వ తరగతి నుంచి డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 88868 82032 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మోగల్లులో ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



ఆసుపత్రికి వచ్చిన యువకుడు

పాలకోడేరు, జూన్ 12: మోగల్లు గ్రామంలోని అల్లంకోడు ప్రాంతంలో ఉపాధి పనులు చేస్తుండగా బుధవారం తేనెటీగలు దాడి చేశాయి. అక్కడ పనులు చేస్తున్న గ్రామానికి చెందిన దాసరి రాజేష్‌పై ఒక్కసా రిగా తేనెటీగలు దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు చేతుల తో కొడుతుండగా మరోచేతికి తేనెటీగ కుట్టడంతో కంగారులో తన చేతిలో ఉన్న కొడవలితో చేతి వేలిని కోసుకున్నాడు. సత్వరమే తోటి ఉపాధికూలీలు పాలకోడేరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్సను అందించారు.




ప్రమాణ స్వీకారోత్సవంలో కైకలూరు టీడీపీ నాయకులు.. మంత్రి కొల్లు రవీంద్రకు నాగేంద్ర కుమార్ సత్కారం



ఆగిరిపల్లిలో మడుపల్లి గోపాల్ అన్నదానం




కలిదిండిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, బస్సులో తరలుతున్న టీడీపీ నాయకులు

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం..

కూటమి శ్రేణుల సంబరాలు

కైకలూరు, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి కైకలూరు నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లాయి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన బస్సుల్లో, కార్లలో కార్యకర్తలు వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, నాయకులు బీకేఎం నాని, పూలా రామచంద్రరావు, బోయిన రామకృష్ణ, వీజేఎస్ మాల్యాద్రి, కరేటి శ్రీహరి, బోయిన శ్రీనివాస్, దావు నాగరాజు, వీరాబత్తిన సుధా తరలివెళ్లారు. ఈ సభా వేదిక వద్ద మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ మహేష్ కుమార్ యాదవ్, పెదన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముదినేపల్లి: మండలంలోని పలు గ్రామాల నుంచి మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీలతో చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి తరలి వెళ్లారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరు విఠల్, శ్రీహరిపురం సర్పంచ్ విశ్వేశ్వరరావు, తెలుగు రైతు నాయకుడు బొప్పన సుందరరామయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, నాయకులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు నాయకత్వంలో కూటమి శ్రేణులు తరలివెళ్లాయి.

కలిదిండి: చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి బుధవారం కలిదిండి నుంచి టీడీపీ శ్రేణులు, ఉచితంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుపై కేసరపల్లి తరలివెళ్లారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద చంద్రబాబు ప్రమాణ స్వీకారం వీక్షించేందుకు అధికారులు స్క్రీన్లను ఏర్పాటు చేశారు. కలిదిండిలో బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కూటమి నాయకులు నున్న రమాదేవి, చిట్టూరి రవీంద్ర, గూడవల్లి శ్రీనివాసరావు, కురేళ్ల ఏడుకొండలు, తట్టుగోళ్ల నాంచారయ్య, నున్న సుబ్రహ్మణ్యం, పేటేటి సత్యనారాయణ, లంకా రత్నారావు పాల్గొన్నారు. మూల్లంకలో మాజీ ఎంపీపీ బండి లక్ష్మీ తులసిరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ముదినేపల్లి: కూటమి ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధ వారం ముదినేపల్లిలో సంబరాలు మిన్నంటాయి. స్థానిక గురజ రోడ్డులోని ఎన్‌డీఏ కార్యాలయం వద్ద టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. సీఎంగా చంద్రబాబు నాయుడు, మంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. పెదగొన్నూరులో కూటమి నాయకులు, కార్యకర్తలు కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై సంబరాలు జరిపారు. కాగా రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం పొందిన మచిలీపట్నం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్తా నాగేంద్ర కుమార్ కేసరపల్లిలో సత్కరించి అభినందనలు తెలిపారు.

ముదినేపల్లి రూరల్: చంద్రబాబు నాలుగోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడంతో వైవాక, వడాలి, పెదపాలపర్రు, చిగురుకోట గ్రామాల్లో సంబరాలు మిన్నంటాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇద్దరు బీసీలకు మంత్రి పదవులు లభించడంతో ఆయా గ్రామాల్లో టపాసులు కాల్చారు.

ఆగిరిపల్లి: చంద్రబాబు నాయుడు, పార్థసారథి ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లిలో నూజివీడు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ మడుపల్లి గోపాల్ భారీ అన్నదానం చేశారు. ఆగిరిపల్లి నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు మల్లవల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి కేసరపల్లి తరలివెళ్లాయి. పార్టీ గ్రామ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు, చవటపల్లి విక్టర్ పాల్గొన్నారు.

ఉచిత ట్యూషన్

కైకలూరు, జూన్ 12: కైకలూరు రామకృష్ణాసేవాసమితిలో విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పనున్నట్టు సేవాసమితి అధ్యక్షుడు వెంకటేశ్వర వర్మ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు అనుభవజ్ఞులైన అధ్యాపకుతో బోధన ఉంటుందని, 1వ తరగతి నుండి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత మగ్గం వర్కుల శిక్షణ

కైకలూరు శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో యువతులకు గురువారం నుంచి మగ్గం వర్కుల ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సేవా సంస్థ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్

ఆగిరిపల్లి, జూన్ 12: ఆగిరిపల్లి గ్రామంలో నూజివీడు రోడ్డులో 13వ తేదీ నుంచి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభిస్తామని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జ్ ఆల్వాన్సా రాణి అన్నారు. ఈ స్టాలులో ఆర్గానిక్ పద్ధతిలో రసాయన ఎరువులు వాడని ఉత్పత్తులు ఉంటాయని, ప్రజలు కొనుగోలు చేయాలని కోరారు.

ప్రమాణ స్వీకారానికి వెళుతూ..



గుండెపోటుతో మృతిచెందిన దేవ

నూజివీడు, జూన్ 12: నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన నాయుడు దేవ (44) అనే వ్యక్తి బుధవారం ఉదయం కేసరపల్లిలో జరిగే చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి వెళుతూ మార్గమధ్యంలో ఆత్కూరు వద్ద మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉదయం 9 గంటలకు తుక్కులూరులో బయల్దేరిన ఆయన ఆత్కూరు వద్ద ట్రాఫిక్ జామ్ అవ్వడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వాహనం దిగి రహదారి పక్కన చెట్టు వద్దకు వెళ్ళి ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలి చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నూజివీడు టీడీపీ మండల అధ్యక్షుడు ముసునూరి రాజా, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ యనమదల సత్యనారాయణ, టీడీపీ నాయకుడు నూతక్కి వేణు తదితరులు దేవ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రహదారిపై చిప్స్ గుట్టను ఢీకొని..

మండవల్లి, జూన్ 12: మండలంలోని భైరవపట్నం గ్రామానికి చెందిన అలిగి కిరణ్‌కుమార్ (25) రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఇతను సోమవారం రాత్రి 9 గంటల సమయంలో జాతీయ రహదారి 165పై ద్విచక్ర వాహనంపై మండవల్లి వైపు వెళుతుండగా భైరవపట్నం రైస్‌మిల్లు వద్ద ఎటువంటి సూచికలు ఏర్పాటు చేయకుండా రహదారి వేసేందుకు కాంట్రాక్టర్ చిప్స్ గుట్ట వేయడంతో ఆ గుట్టను ఢీకొని యువకుడు పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు కైకలూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ప్రమాదం జరిగిందని తెలుసుకున్న కాంట్రాక్టర్ తెల్లారిన తర్వాత గుట్ట చుట్టూ డబ్బాలు, మూటలను ఏర్పాటు చేశాడు.



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి

అంకితభావంతో సేవలందించాలి

నూజివీడు, జూన్ 12: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే ప్రజలకు ఉత్తమ సేవలు అందుతాయని, నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి అన్నారు. బుధవారం నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి విజయవాడకు బదిలీ అయిన చీకటి రాజేష్ బాబు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాజేష్ బాబు సేవలను కొనియాడారు. డీఎస్పీ గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలని కోరారు. కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలలు పనికి వెళ్లవద్దు

ఆగిరిపల్లి, జూన్ 12: బాలలు బడిలోనే ఉండాలని, పనిచేయడానికి వెళ్ళరాదని అడవినెక్కలం సర్పంచ్ వేము రాజు తెలిపారు. అడవినెక్కలం, నెక్కలం గొల్లగూడెం, పోతవరప్పాడు, కనసానపల్లి, వడ్లమాను, సింహాద్రి అప్పారావుపేట, రాజవరం గ్రామాల్లో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లినగరంలో రాజగోపాలుడి గ్రామోత్సవం



మండవల్లి, జూన్ 12: మండవల్లి మండలం అల్లినగరం గ్రామంలోని రుక్మిణీ, సత్యభామా సమేత రాజగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్వామివారిని మేళతాళాలు నడుమ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అడుగడుగునా హారతులిచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రాము, సాంబశివరావు, రామకృష్ణ, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.